
సాక్షి పల్నాడు

శుక్రవారం । 21 । ఫిబ్రవరి । 2025



సదరం క్యాంప్

తెనాలిఅర్బన్: స్థానిక జిల్లా వైద్యశాలలో గురువారం ప్రత్యేక సదరం క్యాంప్‌ను నిర్వహించారు. సూపరింటెండెంట్ సౌభాగ్యవాణి పర్యవేక్షణలో వికలాంగులకు పరీక్షలు చేశారు.



సాగర్ నీటిమట్టం

విజయపురిసౌత్: నాగార్జునసాగర్ జలాశయ నీటిమట్టం గురువారం 535.30 అడుగుల వద్ద ఉంది. జలాశయం నుంచి కుడికాలువకు 9,160 క్యూసెక్కులు వదిలారు.

వైభవంగా మందిర వార్షికోత్సవం



రేపల్లె రూరల్: రేపల్లెలోని అంబేడ్కర్ పార్కు సమీపంలో ఉన్న సాయిబాబా మందిర వార్షికోత్సవం గురువారం వైభవంగా నిర్వహించారు. బాబా వారిని పట్టువస్త్రాలతో అలంకరించారు. ప్రత్యేక పూజలతోపాటు హారతులు పట్టారు. గులాబీ పువ్వులతో పుష్పయాగం చేశారు.

న్యూస్‌రీల్

వైఎస్సార్ సీపీ అనుబంధ విభాగాల అధ్యక్షుల నియామకం

నరసరావుపేట: వైఎస్సార్ సీపీ అధ్యక్షులు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు పల్నాడు జిల్లాకు చెందిన పలువురిని పార్టీ అనుబంధ విభాగాల అధ్యక్షులుగా నియమిస్తూ కేంద్ర కార్యాలయం గురువారం ఉత్తర్వులు జారీ చేసింది. సత్తెనపల్లికి చెందిన పమిడిమళ్ల గీతా హసంతి, సయ్యద్ అహ్మద్(గోరా)లను మహిళా, దివ్యాంగుల విభాగాల అధ్యక్షులుగా నియమించారు. గురజాలకు చెందిన గరిగె పుల్లారావు, వీరభద్రుని రామిరెడ్డి, గట్టిముక్కల మల్లారెడ్డిలను వాణిజ్యం, వైఎస్సార్ టీయూసీ, సోషల్ మీడియా వింగ్‌లకు అధ్యక్షులుగా నియమించారు. నరసరావుపేటకు చెందిన షేక్ రెహమాన్ మున్సిపల్ వింగ్ అధ్యక్షులుగా నియమితులయ్యారు.

అమరేశ్వరుని సేవలో మంత్రి సుభాష్



అమరావతి: ప్రముఖ శైవ క్షేత్రం అమరావతిలోని శ్రీ బాలచాముండికా సమేత అమరేశ్వరుని రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ గురువారం దర్శించుకున్నారు. తొలుత ఆలయ అధికారులు, అర్చకులు ఆయనకు స్వాగతం పలికి దేవాలయంలోకి ఆహ్వానించారు. అమరేశ్వరునికి అభిషేకాలు, బాలచాముండేశ్వరి అమ్మవారికి కుంకుమపూజలు చేశారు. ఆలయ అర్చకులు మంత్రికి ఆశీర్వచనం చేసి, స్వామివారి శేష వస్త్రంతో పాటు తీర్థప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో ఆలయ ఈవో సునీల్‌కుమార్ పాల్గొన్నారు.

కుంభమేళాకు ప్రత్యేక బస్సు

పట్నంబజారు (గుంటూరు ఈస్ట్): భక్తుల కోరిక మేరకు ఏపీఎస్ ఆర్టీసీ అధికారులు కుంభమేళాకు ప్రత్యేక బస్సు సర్వీసు ఏర్పాటు చేశారు. శుక్రవారం ఈ స్పెషల్ హైటెక్ బస్సు బయలుదేరుతుంది. మొత్తం ఎనిమిది రోజుల ప్రయాణంలో భాగంగా అయోధ్య, ప్రయాగ్ రాజ్, వారణాసి ప్రాంతాలను సందర్శించేలా ఈ సర్వీసుకు రూపకల్పన చేశారు. ఉదయం 10గంటలకు బస్సు బయలుదేరనుంది. ఆన్‌లైన్‌లో టికెట్‌ను 91927 సర్వీస్ నంబర్ ద్వారా బుక్ చేసుకునే అవకాశం కల్పించారు. ఒక్కో టికెట్ ధర రూ 8,300 నిర్ణయించారు. భోజనాలు, వసతి ఖర్చుల బాధ్యత ప్రయాణికులదే. వివరాల కోసం 7382897459, 7382896403 నంబర్లో సంప్రదించాలని అధికారులు సూచించారు.

క్వారీ ప్రాంతాన్ని పరిశీలించిన సబ్ కలెక్టర్



వీరనాయకునిపాలెం(వేమూరు): మండలంలోని వీరనాయకునిపాలెంలో మైనింగ్ జరిగిన ప్రాంతాన్ని తెనాలి సబ్ కలెక్టర్ సంజనా సింహా గురువారం పరిశీలించారు. గ్రామానికి చెందిన కొందరు అక్రమ క్వారీయింగ్‌పై గ్రీన్ ట్రిబ్యునల్‌లో ఫిర్యాదు చేశారు. క్షేత్రస్థాయిలో పరిశీలన చేసి నివేదిక అందజేయాలని రెవెన్యూ, మైనింగ్ శాఖాధికారులను కోర్టు ఆదేశించింది. గతంలో గ్రామానికి చెందిన నిరుపేద దళితులకు 32 ఎకరాల భూమిని ప్రభుత్వం అందజేసింది. ఇందులో కొందరు నేతలు ఎటువంటి అనుమతులు లేకుండా క్వారీయింగ్ చేశారు. న్యాయస్థానం ఆదేశాల మేరకు ఎంతమేర మైనింగ్ జరిగిందనే దానిపై రెవెన్యూ, సర్వేయర్లతో నివేదికను తయారు చేస్తున్నారు. దీనిపై సిబ్బందికి సబ్ కలెక్టర్ పలు సూచనలు చేశారు. ఫిర్యాదు చేసిన గ్రామానికి చెందిన పలువురు సబ్ కలెక్టర్‌కు తమ వద్ద ఉన్న సమాచారాన్ని అందజేశారు. తహసీల్దారు కె.శ్రీనివాసశర్మ, ఎస్ఐ డి.వెంకటకృష్ణ, మండల సర్వేయర్ సునీల్ పాల్గొన్నారు.

1,37,523 బస్తాల మిర్చి విక్రయం

కొరిటిపాడు(గుంటూరు): గుంటూరు మార్కెట్ యార్డుకు గురువారం 1,29,446 మిర్చి బస్తాలు రాగా, గత నిల్వలతో కలిపి ఈ–నామ్ విధానం ద్వారా 1,37,523 అమ్మకాలు జరిగాయి. నాన్ ఏసీ కామన్ రకం 334, నంబర్–5, 273, 341, 4884, సూపర్–10 రకాల సగటు ధర రూ.9,000 నుంచి రూ.14,000 వరకు పలికింది. నాన్ ఏసీ ప్రత్యేక రకం తేజ, బాడిగ, దేవనూరు డీలక్స్ రకాల సగటు ధర రూ.10,000 నుంచి రూ.14,000 వరకు ధర లభించింది. తాలు రకం మిర్చికి రూ.4,500 నుంచి రూ.7,500 వరకు ధర పలికింది. అమ్మకాలు ముగిసే సమయానికి యార్డులో ఇంకా 67,713 బస్తాలు నిల్వ ఉన్నట్లు ఉన్నతశ్రేణి కార్యదర్శి ఎ.చంద్రిక తెలిపారు.

కొనసాగుతున్న నష్టాలు

కూటమి పాలనలో అన్నదాతలకు అష్టకష్టాలు

- జిల్లాలో 2.16 లక్షల ఎకరాల్లో వరి సాగు
- బస్తా ధాన్యం రూ.1,300 కూడా పలకని ధర
- 10 వేల ఎకరాల్లో మిర్చి పంట
- క్వింటా రూ.8 వేలకు మించి పలకని వైనం
- 64,165 ఎకరాల్లో పొగాకు సాగు
- సగానికిపైగా పడిపోయిన ధరలతో రైతులకు కన్నీరు
- 500 ఎకరాల్లో కంది పంట
- క్వింటా రూ.6,400కి మించి ఇవ్వని వ్యాపారులు



అద్దంకి ప్రాంతంలో జూట్ సాగు

సాక్షి ప్రతినిధి, బాపట్ల: చంద్రబాబు పాలన అన్నదాతలకు అష్టకష్టాలు మిగులుస్తోంది. బాబు అధికారంలోకి వచ్చినప్పుడు ఒక్కోసారి కరవు వచ్చి పంటలు పండవు, ఇంకోసారి వరదలతో పెను నష్టాలు తప్పవు.. అన్నీ దాటుకుని పంటలు పండినా గిట్టుబాటు ధరలుండవు. రైతులకు చేయూత మచ్చుకైనా కనిపించదు. ఇప్పుడూ కూటమి అధికారంలోకి వచ్చాక ఇదే కొనసాగుతోంది. తొలి ఏడాది ఖరీఫ్ నుంచే రైతులకు కష్టాలు మొదలయ్యాయి. గతంలో వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పాలనలో ప్రాజెక్టులు నీటితో నిండుకుండల్లా కళకళలాడాయి. పంటలు పుష్కలంగా పండాయి. అప్పటి ప్రభుత్వం రైతులకు గిట్టుబాటు ధర కల్పించడంతోపాటు అన్నివిధాలా ఆదుకుంది. కానీ బాబు పాలనలో జిల్లాలో అధికంగా సాగు చేసిన వరితోపాటు పొగాకు, మిర్చి, కంది తదితర పంటలకు మద్దతు ధర లేదు. కనీసం పెట్టుబడులు కూడా రాక అన్నదాతలు లబోదిబో అంటున్నారు.

నిండా మునిగిన వరి రైతులు

జిల్లాలోని రేపల్లె, వేమూరు, బాపట్ల, చీరాల, పర్చూరు ప్రాంతాల్లో ఈ ఏడాది రైతులు 2,16,434 ఎకరాల్లో వరి సాగు చేశారు. ఎకరాకు 35 బస్తాలకు తగ్గకుండా దిగుబడి వచ్చింది. 5,62,729 మెట్రిక్ టన్నుల దిగుబడి వస్తుందని అధికారుల అంచనా. ప్రభుత్వం మాత్రం పట్టుమని 60 వేల మెట్రిక్ టన్నులూ మద్దతు ధరకు కొనలేదు. మిల్లర్లకు అమ్ముదామంటే బస్తా రూ.1,300కు మించి కొనలేదు. 5 లక్షల క్వింటాళ్ల ధాన్యాన్ని తక్కువ ధరకు విక్రయించడంతో అన్నదాతలు తీవ్రంగా నష్టపోయారు. వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వంలో ప్రభుత్వం కొన్న ధాన్యానికి మద్దతు ధర లభించగా.. బయట మార్కెట్‌లో బస్తా రూ. 2 వేలకుపైగా పలికింది. అన్నదాతలకు గిట్టుబాటు లభించింది.

మిర్చి రైతు కంట్లో కారం

జిల్లాలోని నగరం, సంతమాగులూరు, బల్లికురవ, మార్టూరు, యద్దనపూడి, పర్చూరు, కారంచేడు, ఇంకొల్లు, జె.పంగులూరు, అద్దంకి, కొరిశపాడు మండలాల పరిధిలో 9,330 ఎకరాల్లో మిర్చి సాగైంది. గత సంవత్సరం ఎకరానికి 20 క్వింటాళ్లకు పైగా దిగుబడి వచ్చింది. క్వింటా రూ.22 వేలు పలికింది. ఈ ఏడాది ఎకరానికి 5 – 10 క్వింటాళ్ల లోపే దిగుబడి రాగా... ధర రూ. 8 వేల – రూ.10 వేలకు మించలేదు. కూలీల ఖర్చులు కూడా రావని రైతులు లబోదిబో అంటున్నారు. ప్రభుత్వం కూడా మద్దతు ధర, ఇతరత్రా సాయం చేయకుండా మిర్చి రైతు కంట్లో కారం కొడుతోంది.

తేరుకోని పొగాకు రైతులు

ఈ ఏడాది శనగకు బదులు పొగాకు సాగుకు మొగ్గు చూపారు. సంతమాగులూరు, బల్లికురవ, మార్టూరు, యద్దనపూడి, పర్చూరు, కారంచేడు, ఇంకొల్లు, జె.పంగులూరు, అద్దంకి, కొరిశపాడు మండలాల పరిధిలో 64,165 ఎకరాల్లో సాగు చేశారు. బర్లీ వైట్ రకాన్ని అధికంగా.. కొంతమంది బ్యార్నీ రకం వేశారు. ఈ ఏడాది ధరలు పూర్తిగా పడిపోయినట్లు రైతులు పేర్కొంటున్నారు. గత ప్రభుత్వంలో బ్యార్నీ రకం క్వింటా రూ. 30 వేలు పలకగా.. ప్రస్తుతం సగంలోపే ఉంది. బర్లీ రకం రూ.10 వేలు– రూ. 13 వేలు ఉండగా.. ఇప్పుడు దారుణంగా రూ. 3,500 – 4 వేలలోపే పలుకుతోంది. కూలీల ఖర్చులు కూడా రావడం లేదని రైతులు వాపోతున్నారు.



పర్చూరులో సాగు చేస్తున్న పొగాకు

జూట్ రైతులకూ తీవ్ర నష్టం

జిల్లాలోని అద్దంకి, పర్చూరు నియోజకవర్గాల్లో దాదాపు వెయ్యి ఎకరాల్లో జూట్ సాగు చేస్తున్నారు. గత ఏడాది క్వింటా విత్తనాలు రూ. 15 వేల వరకు పలకగా.. ప్రస్తుతం రూ. 5 వేలకు మించడం లేదు. రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు.

సగానికి సగం తగ్గిన కంది ధర

జిల్లాలోని సంతమాగులూరు, బల్లికురవ, పర్చూరు, అద్దంకి, కొరిశపాడు మండలాల పరిధిలో సుమారు 300 ఎకరాల్లో కంది వేశారు. గత ఏడాది క్వింటా రూ. 10 వేలుండగా... ఇప్పుడు రూ. 6 వేలకు మించి లేదు. ఎకరంలో 3 నుంచి 5 క్వింటాళ్లలోపే దిగుబడి వస్తోందని, ఈ లెక్కన ఖర్చులు రావని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ధర లేక ఇబ్బందులు



మాది చిమటవారి పాలెం. రెండు ఎకరాల్లో మిర్చి సాగు చేశా. వైరస్‌తోపాటు నల్లి, తామర పురుగు తెగుళ్లతో దిగుబడి సగం తగ్గింది. దిగుబడి ఎకరానికి 5 క్వింటాళ్లు మించేలా లేదు. ధర రూ. 8 వేలకు మించి లేదు. గత ఏడాదితో పోలిస్తే కూలి ఖర్చులు రెండింతలు పెరిగాయి. అవీ ఇప్పుడు వచ్చేలా లేవు.

– గనిపిశెట్టి వెంకటరావు, రైతు

పొగాకు సాగుతో తీవ్రంగా నష్టం



గత ఏడాది 4 ఎకరాల్లో పొగాకు సాగు చేశా. క్వింటా రూ. 15 వేలకుపైగా పలికింది. మంచి రాబడి వచ్చింది. ఈ సంవత్సరం 7 ఎకరాల్లో వేశా. ఎకరాకు రూ. 1.50 లక్షలు చొప్పున పెట్టుబడి పెట్టా. ఈ ఏడాది క్వింటా ధర రూ. 4 వేలకు మించలేదు. కూలి ఖర్చులు కూడా వచ్చే పరిస్థితి లేదు.

–గొట్టిపాటి వెంకట్రావు, రైతు

దళారుల దెబ్బకు జూట్ ధరలు పతనం



దళారుల జోక్యంతో జూట్ ధరలు బాగా పతనమయ్యాయి. వారు అడిగిందే ధరగా మారింది. నాలుగు ఎకరాల్లో జూట్ వేశా. కోసే ముందు రూ.7 వేల వరకు ధర పలికింది. కొట్టే సమయానికి రూ.6 వేలకు, తర్వాత రూ.ఐదున్నర వేలకు పడింది. గతంలో రూ.15 వేల వరకు ధర లభించింది.

– ఎ. రాంబాబు, రైతు

కందికి మద్దతు ధర కరవు



మాది కొరిశపాడు. గతంలో కంది సాగు చేశా. క్వింటా రూ.15 వేల వరకు ఉండేది. మొన్నటి వరకూ అదే ధర కొనసాగింది. పంట వచ్చే సమయానికి ఇప్పుడు రూ.ఆరున్నర వేలకు పడిపోయింది.

– బ్రహ్మారెడ్డి, రైతు

11 మంది రెవెన్యూ సిబ్బందికి షోకాజ్ నోటీసులు

ఐవీఆర్ఎస్ సర్వేలో అవినీతి ఆరోపణలే కారణం

మార్టూరు: జిల్లా వ్యాప్తంగా కొందరు రెవెన్యూ సిబ్బందికి గురువారం జిల్లా కలెక్టర్ జె. వెంకట మురళి షోకాజ్ నోటీసులు జారీ చేశారు. రెవెన్యూ సమస్యలపై దరఖాస్తు చేసుకున్న వ్యక్తులకు ఇటీవల ఎవరైనా మిమ్మల్ని లంచం అడిగారా? తీసుకున్నారా? అంటూ ప్రభుత్వం తరఫున ఫోన్ ద్వారా ఐవీఆర్ఎస్ సర్వే చేసిన సంగతి తెలిసిందే. అందులో భాగంగా జిల్లాలో 11 మంది రెవెన్యూ సిబ్బందిపై అవినీతి ఆరోపణలు రావడం గమనార్హం. వారిలో అత్యధికంగా మార్టూరు మండలం నుంచి ఐదుగురు వీఆర్వోలు ఉండటం విశేషం షోకాజ్ నోటీసులు అందుకున్న వారిలో ద్రోణాదుల–2, కోలలపూడి, జొన్నతాళి, బొబ్బేపల్లి, మార్టూరు– 3 వీఆర్వోలు కే మోహన్ నాయక్, జి.వీరయ్య, ఎ. ఉమామహేశ్వర రావు, జి.రోశయ్య, కె.మోహనరావు ఉన్నారు. మిగిలిన ఆరుగురిలో నగరం మండలం ధూళిపూడి గ్రామ సర్వేయర్ ఎం. గోపి నాగకృష్ణ, భట్టిప్రోలు వీఆర్ఓ ఎం.లక్ష్మి, అద్దంకి వీఆర్వో ఎం.శ్రీనివాసరావు, ఇంకొల్లు వీఆర్వో ఎం. సురేష్ ఉన్నారు. పర్చూరు మండలం ఉప్పుటూరు వీఆర్వో పి. నాగలక్ష్మి, జే. పంగులూరు మండలం రేణింగివరం వీఆర్వో వి. సుమతి షోకాజ్ నోటీసులు అందుకున్న వారిలో ఉన్నారు. వీరిని మూడు రోజుల్లో సంజాయిషీ ఇవ్వాలని ఆదేశిస్తూ కలెక్టర్ గురువారం సాయంత్రం నోటీసులు జారీ చేశారు.

ఐవీఆర్ఎస్ సర్వే లోపభూయిష్టం

జిల్లాలోని కొందరు వీఆర్వోలు విలేకరులతో మాట్లాడుతూ ఐవీఆర్ఎస్ సర్వే లోపభూయిష్టంగా ఉందన్నారు. దరఖాస్తు చేయని వారికి కూడా ఫోన్ చేసి ఒకటి నొక్కమని ఒత్తిడి చేశారని చెబుతున్నారు. ఎప్పుడైనా ఎక్కడైనా కిందిస్థాయి ఉద్యోగులు, సిబ్బందే బలి పశువులు అవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

రైళ్లు రద్దు

లక్ష్మీపురం(గుంటూరు వెస్ట్): గుంటూరు రైల్వే డివిజన్ మీదుగా వెళ్లే చర్లపల్లి–దానాపూర్–చర్లపల్లి రైళ్లను అనివార్య కారణాల వల్ల రద్దు చేసినట్లు సీనియర్ డీసీఎం ప్రదీప్‌కుమార్ గురువారం తెలిపారు. చర్లపల్లి నుంచి దానాపూర్‌కు ఈనెల 21 నుంచి 28వరకు నడపదలిచిన ప్రత్యేక రైలుతో పాటు దానాపూర్ నుంచి చర్లపల్లి వరకు ఈనెల 21 నుంచి 28వ తేదీ వరకు నడపదలిచిన ప్రత్యేక రైలును రద్దు చేసినట్టు వివరించారు.

రైతుల కన్నీటిలో 'కూటమి' కొట్టుకుపోవడం ఖాయం

- వైఎస్సార్ సీపీ పల్నాడు జిల్లా అధ్యక్షులు పిన్నెల్లి రామకృష్ణారెడ్డి ధ్వజం
- ఎల్లో మీడియా విష ప్రచారంపై ఆగ్రహం



మాచర్ల: రాష్ట్రంలో మిర్చి రైతులతో పాటు వివిధ పంటలు పండించిన రైతులు గిట్టుబాటు ధర లేక అల్లాడిపోతుంటే వారిని ఓదార్చేందుకు వెళ్లిన మాజీ సీఎం జగన్‌మోహన్‌రెడ్డిని అత్యంత దారుణంగా విమర్శిస్తూ టీడీపీ నాయకులు, ఎల్లో మీడియా ప్రచారాన్ని వైఎస్సార్ సీపీ పల్నాడు జిల్లా అధ్యక్షులు పిన్నెల్లి రామకృష్ణారెడ్డి ఖండించారు. ఇది దుర్మార్గమైన చర్య అని పేర్కొన్నారు. మాజీ సీఎం జగన్‌మోహన్‌రెడ్డితో పాటు తమపై కూడా కేసులు పెట్టడం కూటమి ప్రభుత్వం నీచ సంస్కృతికి నిదర్శనమని మండిపడ్డారు. ఆయన గురువారం సాయంత్రం వైఎస్సార్ సీపీ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. ఆయన మాటల్లోనే '' ప్రజలు, రైతులు కష్టాల్లో ఉన్నప్పుడు వారికి అండగా ఉండాల్సిందిపోయి రాష్ట్ర మంత్రులు మాజీ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పర్యటన గురించి నిస్సిగ్గుగా మాట్లాడటం హేయమైన చర్య. రైతుల కష్టాలను వక్రీకరించి, తప్పుడు ప్రచారం చేస్తున్నారు. మీరు చెప్పేదంతా అబద్ధాలు.. నేను చెబుతున్నాను.. రాష్ట్ర ముఖ్యమంత్రి, మంత్రులకు సవాల్ విసురుతున్నాను. వందలాది మంది పోలీసులను పెట్టుకొని మీ ఆఫీసుల్లో ఏసీ గదుల్లో కూర్చొని మాట్లాడటం కాదు.. ఇవే మాటలు మీకు దగ్గరలో ఉన్న గుంటూరు వెళ్లి మిర్చి యార్డులో రైతుల బాధలు వినండి. మీ సంగతేంటో ఆ రైతులు చెబుతారు. మీరు మాట్లాడకుండా.. మిమ్మల్ని మిరపకాయలు దంచినట్లు దంచేస్తారు. వైఎస్సార్‌సీపీ అధినేత పర్యటనలో ఉద్దేశపూర్వకంగా ఒక్క పోలీసునైనా పెట్టలేదు. జెడ్ ప్లస్ క్యాటగిరి ఉన్నా ఆయనను వెళ్లనీయకుండా ప్రయత్నాలు చేశారు. ఎవరూ ప్రభుత్వాన్ని ప్రశ్నించకూడదా? పోరాటాలు చేయకూడదన్నట్లు వ్యవహరిస్తున్నారు... మీలాంటి బెదిరింపు ఎత్తుగడలు, కుత్రలను పట్టించుకునే నాయకుడు జగన్ కాదని గుర్తుంచుకోండి. మీరు ఎన్ని వక్రీకరణలతో ఎల్లో మీడియాతో చెప్పినా, డ్రామాలంటూ చెప్పినా అది మీ ఆత్మవంచనే. గతంలో రైతులకు ఏ పంటకు ఎంత ధరలున్నాయో తెలుసుకోండి. 2022, 2023లో ధరలెలా ఉన్నాయో చెప్పండి. రైతుల సమస్యలకు పరిష్కారం కృషి చేసిన ఘనత జగన్‌మోహన్‌రెడ్డిదే.. ఆయన రైతులకు రైతు భరోసా కేంద్రాలు ఏర్పాటు చేయటమే కాకుండా వారికి న్యాయం చేశారు. రైతులను ఇప్పుడు చంద్రబాబు పీడిస్తున్నారు. వైఎస్సార్ సీపీలో మిర్చి పంట రూ. 20వేల వరకు ఉంది. ఇప్పుడు రూ. 11వేలకు పడిపోయింది. రైతులు ఆత్మహత్య చేసుకునే పరిస్థితి నెలకొంది. కృష్ణా, గుంటూరు, బాపట్ల, ప్రకాశం, కర్నూలు, అనంతపురం రైతుల పరిస్థితి ఇలాగే ఉంది. రైతులను ఆదుకోకుండా మోసగిస్తూ నిర్లక్ష్యం చేయటమే మీ తీరా? రైతుల సమస్యల గురించి తెలుసుకోవటానికి వెళితే మాజీ సీఎం, మరో ఏడుగురిపై అక్రమ కేసులు నమోదు చేసి ఏమి సాధిస్తారు. మీకు చేతనైతే మిర్చి, కంది, పత్తి రైతును ఆదుకునేలా చేయండి. ఆర్‌బీకే కేంద్రాల ద్వారా రైతులకు న్యాయం చేయండి. వైఎస్సార్ ప్రభుత్వం 2024 ముందు వరకు ఎన్ని కోట్ల రూపాయలు ఇచ్చిందో గుర్తు చేసుకోండి. రైతులపై ఒక్క రూపాయి మోపకుండా 54.55లక్షల మందికి రూ 7.80 కోట్లు నష్టపరిహారం కింద చెల్లించారు. అన్ని పంటలకు కనీస మద్దతు ధర నిచ్చాం. సీఎం చంద్రబాబు ఇప్పటికైనా కళ్లు తెరవండి. రైతు కన్నీళ్లు పెట్టుకుంటే అరిష్టమని మీరు మరచిపోతున్నారు. మీకు రైతులపై ప్రేమ ఉంటే గుంటూరు మిర్చి యార్డుకు వచ్చి వారితో మాట్లాడి అండగా నిలబడండి.. మమ్మల్ని ఇబ్బంది పెట్టినా ఫర్వాలేదు. కానీ రైతుల కోసం మీరు నిలబడకపోతే మాజీ సీఎం జగన్ ఆధ్వర్యంలో మా పోరాటం ముందుకు కొనసాగుతుంది''అని పీఆర్కే తెలిపారు.

పక్కాగా టెన్త్, ఇంటర్ పరీక్షలు

కలెక్టర్ పి.అరుణ్‌బాబు



కలెక్టరేట్ నుంచి సమీక్షకు హాజరైన జిల్లా కలెక్టర్, ఎస్పీ, జాయింట్ కలెక్టర్

నరసరావుపేట: పదో తరగతి, ఇంటర్మీడియట్ పరీక్షలను సజావుగా, పకడ్బందీగా నిర్వహించేలా చర్యలు చేపట్టాలని సంబంధిత అధికారులను జిల్లా కలెక్టర్ పి.అరుణ్‌బాబు ఆదేశించారు. సచివాలయం నుంచి గురువారం ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి విజయానంద్ పలు అంశాలపై కలెక్టర్లు, ఎస్పీలతో నిర్వహించిన వీడియా కాన్ఫరెన్స్‌కు కలెక్టరేట్ నుంచి ఎస్పీ కంచి శ్రీనివాసరావుతో కలిసి కలెక్టర్ పాల్గొన్నారు. సమీక్ష సమావేశం అనంతరం జిల్లా కలెక్టర్ సంబంధిత శాఖల అధికారులతో మాట్లాడారు. వాట్సాప్ గవర్నెన్స్‌పై అవగాహన కల్పించేలా ప్రత్యేకమైన సెల్‌ను కలెక్టరేట్‌లో ఏర్పాటు చేయాలని చెప్పారు. దీనిపై ప్రజలలో అవగాహన కల్పించే విధంగా రైల్వేస్టేషన్లు, బస్‌స్టేషన్లు ప్రధాన కూడళ్లలో అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు. ప్రభుత్వ వైద్యశాలల్లో సక్రమంగా సేవలు అందించాలని ఆదేశించారు. అన్ని అంశాల్లో పల్నాడు జిల్లా ముందంజలో ఉండే విధంగా చర్యలు చేపట్టాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా జాయింట్ కలెక్టర్ సూరజ్ గనోరే, జిల్లా రెవెన్యూ అధికారి ఏ.మురళి, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

పరీక్షల వేళ ఒత్తిడి వద్దు

నరసరావుపేట: పదో తరగతి విద్యార్థులు అనవసర భయాలు, ఒత్తిడికి లోనుకాకుండా పరీక్షలు రాయాలని జిల్లా కలెక్టర్ పి.అరుణ్‌బాబు పిలుపునిచ్చారు. ఫలితాల గురించి అతిగా ఆలోచించకుండా చేయాల్సిన పనిపై మాత్రమే దృష్టి సారిస్తే ఒత్తిడి దరిచేరదని సూచించారు. కలెక్టరేట్‌లోని ఎస్సార్ శంకరన్ వీడియో కాన్ఫరెన్స్ హాలు నుంచి పదో తరగతి విద్యార్థులకు పరీక్షల భయం పోగొట్టేందుకు 'స్ఫూర్తి' కార్యక్రమం ద్వారా ఆన్‌లైన్ కౌన్సెలింగ్ నిర్వహించారు. ఒత్తిడికి గురైనప్పుడు భయాలను ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, స్నేహితులతో పంచుకోవాలని కలెక్టర్ విద్యార్థులకు సూచించారు. పదో తరగతి అనేది విద్యార్థి జీవితంలో కేవలం ప్రారంభం మాత్రమేనని, పరీక్షలకు మించిన జీవితం ఎంతో ఉందని తెలిపారు. ఎస్పీ కంచి శ్రీనివాసరావు మాట్లాడుతూ పరీక్షలు అనేవి మన జ్ఞానాన్ని కొలిచే కొలమానాలుగా కాకుండా ప్రదర్శించే అవకాశాలుగా భావించాలని చెప్పారు. ఎప్పటికప్పుడు చేసిన పొరపాట్లను గుర్తించి వాటిని సరిచేసుకున్న వారు భవిష్యత్తులో ఉన్నత స్థాయికి చేరుకుంటారని తెలిపారు. నిపుణులు మాట్లాడుతూ అందుబాటులో ఉన్న సమయానికి తగ్గట్టు టైం టేబుల్ తయారు చేసుకుని క్రమ పద్ధతిలో చదవాలని సూచించారు. పరీక్షల సమయంలో బాగా చదవడంతో పాటూ ఆరోగ్యాన్ని కాపాడుకోవడం ముఖ్యమని తెలిపారు. పరీక్షల ముందు రోజు అర్ధరాత్రి వరకూ చదివి ఆరోగ్యాన్ని పాడు చేసుకుంటే పరీక్షలు రాయలేని పరిస్థితి వస్తుందని హితవు పలికారు. సమావేశంలో డీఈవో చంద్రకళ, రిటైర్డు ఐఏఎస్ బి.రాజేశ్వరరావు, వ్యాపారవేత్త వీరరాఘవరావు, ట్రైనర్లు బొండ్లపాటి రాధిక, చిన్నం వెంకట్‌లతో పాటు జిల్లాలోని 456 పాఠశాలల మేనేజ్‌మెంట్లు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ఎద్దుల బీడు ఫర్ సేల్



పొందుగల గ్రామ సమీపంలోని ఎద్దుల బీడు

- భూములు విక్రయించేందుకు చర్యలు
- కాపాడాలంటున్న రైతులు, ప్రజలు
- తాజా మాజీ సర్పంచ్ బేరం పెట్టినట్లు సమాచారం

సాక్షి, నరసరావుపేట : పశువులకు పచ్చటి గడ్డి అందించడం కోసం వందల సంవత్సరాల కిందట కేటాయించిన భూమిలో గద్దలు వాలడానికి సిద్ధమయ్యాయి. పల్నాడు జిల్లా దాచేపల్లి మండలం పొందుగల గ్రామ సమీపంలోని ఎద్దుల బీడు భూములను విక్రయించేందుకు ఓ గ్రామ తాజా మాజీ సర్పంచ్ బేరం పెట్టినట్లు స్థానికంగా ప్రచారం జరుగుతోంది. అడ్వాన్స్ కూడా తీసుకున్నట్లుగా సమాచారం.

ఆన్‌లైన్‌లో నమోదు

మిగిలిన భూములను పలువురు అనధికారికంగా రెవెన్యూ అధికారులకు తాయిలాలు ముట్టజెప్పి ఆన్‌లైన్‌లో నమోదు చేయించుకుని, తాజాగా అమ్మకాలకు పెట్టారు. మాజీ సర్పంచ్ నాలుగు ఎకరాల భూములను విక్రయించేందుకు అడ్వాన్స్ కూడా తీసుకున్నట్లు పొందుగలతో పాటు చుట్టుపక్కల గ్రామాల్లో ప్రచారం జరుగుతోంది. ఎకరం రూ.12 లక్షల చొప్పున విక్రయించేలా ఒప్పందాలు జరిగినట్లు సమాచారం. అధికార పార్టీకి అనుకూలంగా వ్యవహరిస్తూ పనులను చక్కదిద్దుకునే యత్నంలో ఆయన నిమగ్నమైనట్లు తెలుస్తోంది. ఒక కుటుంబంలోని వ్యక్తులకు ఒకే ఖాతా నంబర్లు వేసుకుని విక్రయానికి పావులు కదుపుతున్నారు. పశువుల కోసం కేటాయించిన ఈ భూములను కాపాడుకునేందుకు ఆయా గ్రామాల్లోని రైతులు కూడా సన్నద్ధమవుతున్నట్లు తెలుస్తోంది. అధికారపార్టీలో సైతం తీవ్ర చర్చ జరుగుతోంది. స్థానిక శాసనసభ్యుడు యరపతినేని శ్రీనివాసరావు దృష్టికి సమస్యను తీసుకెళ్లేందుకు రైతులు సన్నద్ధమవుతున్నట్లు సమాచారం. విక్రయానికి సిద్ధంగా ఉన్న ఎద్దుల బీడు భూములను కాపాడాలని రైతులతో పాటు స్థానికులు కోరుతున్నారు.

150 ఎకరాలకు పైగా భూమి

అద్దంకి–నార్కెట్‌పల్లి జాతీయ రహదారిని అనుకుని పలు సర్వే నంబర్లలో 150 ఎకరాలకు పైగా (ప్రభుత్వ భూమి) ఎద్దుల బీడు విస్తరించి ఉంది. పొందుగల, రామాపురం, శ్రీనగర్, శ్రీనివాసపురం గ్రామాల్లో వేల సంఖ్యలో పశువులు ఉన్నాయి. చుట్టూ ఉన్న పంటల పొలాల్లోకి వెళ్లకుండా ఈ బీడుల్లో పశువులు మేత మేసేందుకు కేటాయించారు. అయితే, ఈ భూముల్లో విశ్రాంత ఆర్మీ ఉద్యోగులతో పాటుగా మరికొంతమందికి అధికారంగా కేటాయించారు. ఇది పోగా సుమారుగా మరో 80 ఎకరాలకు పైగా భూమి ఖాళీగా ఉంది.

స్ట్రాంగ్‌రూంల వద్ద కట్టుదిట్ట భద్రత

గుంటూరు ఎస్పీ సతీష్‌కుమార్



సిబ్బందితో మాట్లాడుతున్న ఎస్పీ సతీష్‌కుమార్

నగరంపాలెం(గుంటూరు వెస్ట్): ఎమ్మెల్సీ ఎన్నికల బ్యాలెట్ పెట్టెలను భద్రపరిచే స్ట్రాంగ్ రూంల వద్ద కట్టుదిట్టమైన భద్రతను ఏర్పాటు చేసినట్లు ఎస్పీ సతీష్‌కుమార్ చెప్పారు. ఈనెల 27న జరగనున్న ఉమ్మడి గుంటూరు–కృష్ణా జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల బ్యాలెట్ పెట్టెలను భద్రపరిచేందుకు ఏసీ కళాశాలలో ఏర్పాటు చేసిన నాలుగు స్ట్రాంగ్ రూంలను గురువారం ఎస్పీ పరిశీలించారు. అవాంఛనీయ ఘటనలు జరగకుండా నియమించాల్సిన పోలీస్ బందోబస్తు, స్ట్రాంగ్ రూంల వద్దకు వెళ్లే మార్గాలు, బ్యాలెట్ పెట్టెల తరలింపుపై చర్చించి, పలు సూచనలు చేశారు. అనంతరం రెవెన్యూ శాఖ నుంచి చేపట్టే ఏర్పాట్లపై ఆరాతీశారు. పోలీస్, రెవెన్యూ శాఖల సమన్వయంతో విధులు నిర్వర్తించాలని ఎస్పీ చెప్పారు. ఏఎస్పీలు జీవీ రమణమూర్తి (పరిపాలన), హనుమంతు (ఏఆర్), ఏఆర్ డీఎస్పీ ఏడుకొండలరెడ్డి, తూర్పు, పశ్చిమ తహసీల్దార్లు గణేష్ (తూర్పు), వెంకటేశ్వర్లు (పశ్చిమ), కళాశాల ప్రిన్సిపల్ మోజేస్ పాల్గొన్నారు.

కూటమి నేతల కుయుక్తులు

- భవ్య సిమెంట్ ఫ్యాక్టరీ వద్ద మూడు రోజులుగా కూటమి నేతల ఆందోళన
- కార్మికులను బయటకు పంపిన వైనం
- గత్యంతరం లేక ఫ్యాక్టరీ కార్యకలాపాలు నిలిపివేసిన యజమాన్యం
- స్వప్రయోజనాల కోసమే ఆందోళన చేస్తున్నారనే విమర్శలు


విధులకు వెళ్లనివ్వకపోవడంతో నిలుచున్న కార్మికులు

సాక్షి, నరసరావుపేట : దాచేపల్లి మండలం తంగెడలోని భవ్య సిమెంట్ ఫ్యాక్టరీ వద్ద కొనసాగుతున్న ఆందోళన పక్కదారి పడుతోంది. అధికార పార్టీకి చెందిన నాయకులు చేస్తున్న ఆందోళన వెనుక నేతల స్వప్రయోజనాలు ఉన్నాయనే ప్రచారం జరుగుతోంది. గత మూడు రోజులుగా భవ్య సిమెంట్ ఫ్యాక్టరీ వద్ద జరుగుతున్న ఆందోళనపై యజమాన్యం సానుకూలంగా ఉన్నా కూటమి నేతలు కావాలనే రెచ్చగొట్టి పక్కదారి పట్టిస్తున్నారు. ప్రధాన గేట్ వద్ద ఆందోళనలు చేస్తూ కార్మికులను, పర్మినెంట్ ఎంప్లాయిస్‌ను విధులకు వెళ్లకుండా అడ్డుకుంటున్నారు. బుధవారం రాత్రి సీ షిఫ్ట్ కార్మికులను లోపలికి వెళ్లనీయలేదు. గురువారం ఏ షిఫ్ట్ కార్మికులను కూడా లోపలికి వెళ్లనీయకుండా అడ్డుకున్నారు. ఫ్యాక్టరీ లోపల ఉన్న కార్మికులను కూడా బలవంతంగా బయటకు పంపించారు. దీంతో చేసేదిమి లేక ఫ్యాక్టరీ కార్యకలాపాలు పూర్తి స్థాయిలో నిలిపివేశారు. దీంతో ప్రత్యక్షంగా, పరోక్షంగా 400మందికి పైగా కార్మికులు ఉపాధిపై తీవ్ర ప్రభావం చూపింది. ఫ్యాక్టరీలో లోడింగ్, అన్ లోడింగ్ కోసం వచ్చిన లారీలు యార్డులో ఉన్నాయి. డ్రైవర్లు, క్లీనర్లు ఇబ్బందులు పడుతున్నారు.

వ్యక్తిగత ప్రయోజనాలే లక్ష్యం

సమస్యల పరిష్కారానికి యజమాన్యం సానుకూలంగా వ్యవహరిస్తున్నప్పటికీ వ్యక్తిగత ప్రయోజనాల కోసం కూటమి నేతలు ఆందోళనను కొనసాగిస్తున్నారనే విమర్శలు వస్తున్నాయి. తంగెడ గ్రామ పరిధిలో ఉన్న ఈ ఫ్యాక్టరీపై పెత్తనం చేసేందుకు పావులు కదుపుతున్నారు. తమ గ్రామానికి చెందిన 20 మందికి ఉద్యోగ అవకాశాలు కల్పించాలనే ప్రతిపాదన యాజమాన్యం ముందు పెట్టారు. దీనికి సానుకూలంగా స్పందించి దశలవారీగా అవకాశాలు కల్పిస్తామని హామీ ఇచ్చింది. అయితే, కూటమి నేతలు తాము అడిగినన్ని ఉద్యోగాలు ఇవ్వాలనే డిమాండ్‌తో గత మూడు రోజులుగా ఆందోళన చేస్తున్నారు. పరిశ్రమల స్థాపన ద్వారా స్థానికులకు ఉద్యోగ అవకాశాలు కల్పించినప్పటికీ కూటమి నేతలు అధికార ముసుగులో స్వప్రయోజనాలను సాధించుకునేందుకు కుటిల ప్రయత్నాలు చేస్తున్నారనే విమర్శలు వస్తున్నాయి. పారిశ్రామికంగా అభివృద్ధి చెందుతున్న పల్నాడులో ఇంకా ఎన్నో పరిశ్రమలు స్థాపించేందుకు పారిశ్రామికవేత్తలు ముందుకు వస్తున్నారు. ఇటువంటి ఘటనలు పారిశ్రామిక అభివృద్ధికి గొడ్డలి పెట్టుగా ఉంటాయని పలువురు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. జరిగిన సంఘటనలపై స్పందించేందుకు యజమాన్య ప్రతినిధులు నిరాకరించారు.

అండగా నిలిచి న్యాయం చేయాలి

- మంత్రిని కలిసిన సాయి సాధన చిట్‌ఫండ్ బాధితులు
- హోం మంత్రిని కలవనున్న బాధితులు
- కేసు దర్యాప్తుకు ప్రత్యేక బృందం ఏర్పాటు


మంత్రి గొట్టిపాటి రవిను కలిసి న్యాయం చేయాలని కోరుతున్న పుల్లారావు బాధితులు

నరసరావుపేటటౌన్: ఆర్థిక నేరస్తుడు పాలడుగు పుల్లారావు కుటుంబ సభ్యులతోపాటు వారికి సహకరిస్తున్న గుంటూరు సీఐపై చర్యలు తీసుకోవాలని చిట్‌ఫండ్ బాధితులు ఇన్‌చార్జి మంత్రి గొట్టిపాటి రవికుమార్‌ను కలిసి విన్నవించారు. గురువారం స్థానిక టీడీపీ కార్యాలయానికి వచ్చిన ఆయన్ను బాధితులు కలిసి మాట్లాడారు. సాయి సాధన చిట్‌ఫండ్‌లో సుమారు 600 మంది సభ్యులుగా చేరి కోట్ల రూపాయలు చెల్లించారని, పలువురు డిపాజిట్లు కూడా చేశారని తెలిపారు. డబ్బు మొత్తం పోగేసుకొని చిట్‌ఫండ్ నిర్వాహకుడు పుల్లారావు పరారీ అయి కోర్టులో లొంగిపోయి, జైల్లో ఉన్నాడని వివరించారు. రాజీ పేరుతో మభ్యపెడుతూ కేసులో ముద్దాయిలుగా ఉన్న కుటుంబ సభ్యులను విదేశాలకు పంపించే ప్రయత్నం చేస్తున్నాడని చెప్పారు. నిందితుల సమీప బంధువు అయిన సీఐ అన్ని విధాలుగా వారికి సహకరిస్తూ పుల్లారావు దోచుకున్న డబ్బులు ఎగ్గొట్టే కుట్ర పన్నుతున్నాడని ఆరోపించారు. ఈ వ్యవహారంలో అండగా నిలబడి న్యాయం చేసేలా చూడాలని బాధితులు కోరారు. స్పందించిన మంత్రి ఇప్పటికే అనేక మార్లు ఐజీతో మాట్లాడానని, సత్వరమే న్యాయం చేసే విధంగా చూస్తానని హామీ ఇచ్చారు.

ప్రత్యేక బృందం ఏర్పాటు

సాయి సాధన చిట్‌ఫండ్ స్కాంపై వన్‌టౌన్ పోలీసులు కేసు నమోదు చేసి సీఐడీకి బదిలీ చేసిన విషయం తెలిసిందే. కేసు త్వరితగతిన పూర్తి చేయాలని ఉన్నతాధికారుల నుంచి వచ్చిన ఆదేశాల మేరకు సీఐడీతో పాటు సివిల్ పోలీసులు ప్రత్యేక బృందంగా ఏర్పడ్డారు. బాపట్ల ఎస్పీ తుషార్ డూడి, రేపల్లె డీఎస్పీ శ్రీనివాసులు, మాచర్ల రూరల్ సీఐ హఫీజ్ భాషా మరి కొందరు అధికారులు ప్రత్యేక బృందంలో సభ్యులుగా నియమితులయ్యారు.

నేడే హోం మంత్రిని కలవనున్న బాధితులు

ఎమ్మెల్యే చదలవాడ అరవిందబాబు ఆధ్వర్యంలో చిట్‌ఫండ్ బాధితులు శుక్రవారం హోం మంత్రిని కలవనున్నారు. పుల్లారావు ఆస్తుల జప్తుతో పాటు అతని కుటుంబ సభ్యులను అరెస్ట్ చేయాలని కోరనున్నారు. ఉదయం 10 గంటలకు కలిసేందుకు అవకాశం ఇచ్చినట్లు బాధితులు తెలిపారు. భారీ సంఖ్యలో నరసరావుపేట నుంచి బాధితులు తరలి వెళ్లనున్నారు.

నిబంధనలు పాటించడం తప్పనిసరి

డీఎంహెచ్‌వో డాక్టర్ రవి


ఐవీఎఫ్ సెంటర్‌లో డాక్టర్‌తో మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో డాక్టర్ రవి

నరసరావుపేట: జిల్లాలోని అన్ని ప్రైవేటు, ప్రభుత్వ ఆసుపత్రులు వైద్య, ఆరోగ్యశాఖ నిబంధనలు కచ్చితంగా అమలుచేయాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ బి.రవి ఆదేశించారు. జిల్లాలో అన్ని ప్రైవేటు, ప్రభుత్వ ఆసుపత్రుల్లో నిర్వహించిన సీ-సెక్షన్ ఆపరేషన్ల ఆడిట్‌లో భాగంగా గురువారం ఆయన స్థానిక శ్రేయ ఐవీఎఫ్ సెంటర్‌ను తనిఖీ చేశారు. సీ-సెక్షన్ డెలివరీస్ రికార్డులను పరిశీలించారు. వీలైనంతవరకు సీజేరియన్ డెలివరీస్ తగ్గించాలని సూచించారు. అనంతరం స్కాన్ సెంటర్‌ను పరిశీలించారు. పీసీపీఎన్‌డీటీ యాక్ట్ నిబంధనలకు లోబడి అన్ని మార్పులు సరి చేసుకోవాలని సూచించారు. ప్రభుత్వం నిర్దేశించిన మార్గదర్శకాల ప్రకారం రిజిస్ట్రేషన్, రెన్యువల్స్ సకాలంలో చేసుకోవాలని తెలిపారు. లోపాలపై శాఖాపరమైన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. ఆయన వెంట స్టాటిస్టికల్ ఆఫీసర్ నీలకంఠేశ్వరరావు, సిబ్బంది ఉన్నారు.

ఈనెల 23న రాష్ట్రస్థాయి ఓపెన్ చెస్ టోర్నమెంట్



గుంటూరు ఎడ్యుకేషన్: జేకేసీ కళాశాల రోడ్డులోని డాక్టర్ కేఎల్పీ పబ్లిక్ స్కూల్లో ఆంధ్రప్రదేశ్ చెస్ అసోసియేషన్ సహకారంతో ఈనెల 23న రాష్ట్రస్థాయి ఓపెన్ చెస్ టోర్నమెంట్ నిర్వహిస్తున్నట్లు పాఠశాల కరస్పాండెంట్ కె.కృష్ణప్రసాద్ తెలిపారు. గురువారం పాఠశాలలో చెస్ టోర్నమెంట్ బ్రోచర్లు విడుదల చేశారు. ఈసందర్భంగా కృష్ణప్రసాద్ మాట్లాడుతూ టోర్నమెంట్‌లో విజేతలకు రూ.30,300 నగదు బహుమతితో పాటు ప్రత్యేక బహుమతులు అందజేస్తారని తెలిపారు. చదరంగ పోటీల్లో పాల్గొనే ఆసక్తి గల క్రీడాకారులు ఈనెల 22లోపు పేర్లు నమోదు చేసుకోవాలని, వివరాలకు టోర్నమెంట్ ఆర్బిటర్ ఎం.గోపీనాథ్‌ను 97030 49378, 93913 39343 నంబర్లలో సంప్రదించాలని సూచించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ జి.రత్తయ్య, ఏవో కె. వెంకట్రావు పాల్గొన్నారు.

బడ్జెట్‌లో చేనేత రంగానికి రూ.2వేల కోట్లు కేటాయించాలి

చేనేత కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పిల్లలమర్రి నాగేశ్వరరావు



మంగళగిరి టౌన్ : రాష్ట్ర ప్రభుత్వ బడ్జెట్‌లో చేనేత రంగానికి రూ. 2వేల కోట్లు నిధులు కేటాయించాలని ఆంధ్రప్రదేశ్ చేనేత కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పిల్లలమర్రి నాగేశ్వరరావు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. మంగళగిరి నగర పరిధిలోని ఏపీ చేనేత కార్మిక సంఘం కార్యాలయంలో గురువారం విలేకరుల సమావేశం నిర్వహించారు. నాగేశ్వరరావు మాట్లాడుతూ చేనేతలకు జనాభా ప్రాతిపదికన నిధులు కేటాయించాలని కోరారు. చేనేత సహకార సంఘాలకు బకాయి ఉన్న రూ. 172 కోట్లను వెంటనే విడుదలచేయాలని డిమాండ్ చేశారు. సంఘాలకు ఎన్నికలు నిర్వహించాలని, నేతన్న నేస్తం పథకాన్ని రూ.24 వేల నుంచి రూ.36 వేల రూపాయలకు పెంచాలని కోరారు. బడ్జెట్‌లో తగినన్ని నిధులు కేటాయించకుంటే ఆందోళన చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్షులు వెంకట కృష్ణారావు, ఉపాధ్యక్షులు శ్రీనివాసరావు పాల్గొన్నారు.

టీటీడీ సభ్యుడిపై చర్యలు తీసుకోండి


ప్రభుత్వాన్ని కోరిన బొందిలి రాష్ట్ర నాయకులు



నరసరావుపేట: శ్రీ వెంకటేశ్వరుడు నిలయమైన తిరుమల ఆలయంలో మహా ద్వారం వద్ద విధులు నిర్వహిస్తున్న బాలాజీ సింగ్‌పై టీటీడీ పాలకవర్గ సభ్యుడు నరేష్‌కుమార్ అసభ్యకరమైన పదజాలంతో విరుచుకుపడటాన్ని ఏపీ రాష్ట్ర బొందిలి సంఘ నాయకులు తీవ్రంగా ఖండించారు. స్థానిక కార్యాలయంలో గురువారం సంఘ నాయకులు సమావేశమయ్యారు. సంఘ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి బొందిలి శ్రీనివాస సింగ్ మాట్లాడుతూ విధుల్లో ఉన్న ఉద్యోగిపై నరేష్‌కుమార్ ''నిన్ను ఎవరు ఇక్కడ పెట్టించింది.. ఏమనుకుంటున్నావు.. నీ సంగతి చూస్తా.. ఎవరితో ఎలా మాట్లాడాలో తెలియదా? నువ్వు ముందు బయటికి పో'' అంటూ దూషించడం దారుణమని తెలిపారు. వెంటనే నరేష్ కుమార్ క్షమాపణ చెప్పాలని, ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు స్పందించి పాలకవర్గ సభ్యుడుగా ఉన్న అతడిని వెంటనే తొలగించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో బీసీ సంఘ నేతలు డి.ఖాసిం పీరా, ముంటి నాగమల్‌సింగ్, చావలి మురళి, చిందే నాగేశ్వరరావు పాల్గొన్నారు.

టోల్ ప్లాజాల వద్ద సౌకర్యాల కల్పనే లక్ష్యం

ఎన్‌హెచ్ఏఐ ఆర్‌వో ఆర్‌కే సింగ్



మంగళగిరి: టోల్ ప్లాజాల వద్ద ప్రయాణికుల కోసం వసతులు కల్పించేందుకు కృషి చేస్తామని ఎన్‌హెచ్ఏఐ ఆర్‌వో ఆర్‌కే సింగ్ తెలిపారు. నగర పరిధిలోని కాజ టోల్ గేట్ వద్ద ఏర్పాటు చేసిన కొత్త అంబులెన్స్‌లతోపాటు బేబీ కేర్ రూమ్‌లను గురువారం ఆయన ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ అంబులెన్సులు, బేబీకేర్ రూంలు ప్రయాణికులకు సౌలభ్యంగా ఉంటాయన్నారు. కార్యక్రమంలో టోల్ ప్లాజా మేనేజర్ రవి, బేబీ కేర్ రూమ్ దాతలు శ్రీ వేంకటేశ్వర ఫుడ్ బేవరేజస్ ప్రైవేట్ లిమిటెడ్ నిర్వాహకులు పాలడగు కృష్ణ వంశీ,శ్రీనివాసరావు, కృష్ణ చైతన్య పాల్గొన్నారు.

కౌలు రైతులకు కిసాన్ క్రెడిట్ కార్డులు ఇవ్వాలి

లక్ష్మీపురం(గుంటూరు వెస్ట్): కౌలు రైతులకు ఎటువంటి ష్యూరిటీలు లేకుండా పంట రుణాలు, కిసాన్ క్రెడిట్ కార్డులు ఇవ్వాలని కౌలు రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పి.వి.జగన్నాథం డిమాండ్ చేశారు. ఈ మేరకు జీటీ రోడ్డులోని లీడ్ బ్యాంక్ అసిస్టెంట్ మేనేజర్‌ను కలసి వినతిపత్రం అందజేశారు. అనంతరం మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల సచివాలయంలో నిర్వహించిన రాష్ట్ర స్థాయి బ్యాంకర్ సమావేశంలో కౌలు రైతులకు పెద్దఎత్తున పంట రుణాలు ఇచ్చామని చెప్పడం విడ్డూరమని పేర్కొన్నారు. కార్యక్రమంలో కౌలు రైతు సంఘం జిల్లా అధ్యక్షులు కంజుల విఠల్ రెడ్డి, ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా కార్యదర్శి పచ్చల శివాజీ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

22,23 తేదీల్లో జిల్లాస్థాయి క్రీడా పోటీలు

పెదకూరపాడు: పల్నాడు జిల్లా స్థాయిలో క్రీడా పోటీలను ఈ నెల 22, 23 తేదీల్లో నిర్వహిస్తున్నామని జన చైతన్య సమితి కో-ఆర్డినేటర్ వెలితోటి అనిల్‌కుమార్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. నెహ్రూ యువ కేంద్రం, జన చైతన్య సమితి ఆధ్వర్యంలో వాలీబాల్, కబడ్డీ, రన్నింగ్, లాంగ్ జంప్ క్రీడాంశాల్లో పెదకూరపాడులోని జీఆర్ సీఆర్‌కే శ్రీ చైతన్య స్పోర్ట్స్ అకాడమీ క్రీడా ప్రాంగణంలో పోటీలు జరుగుతాయని పేర్కొన్నారు. విజేతలకు ప్రభుత్వ సర్టిఫికెట్లతో పాటు, షీల్డ్‌లను కూడా బహూకరించనున్నట్లు తెలియజేశారు. పురుషులకు, మహిళలకు వేర్వేరుగా ఈ పోటీలు జరుగుతాయని తెలిపారు. వివరాలకు 8886777767, 9848977677, 8008094045 నంబర్లలో సంప్రదించాలని అనిల్ కుమార్ కోరారు.

పోలీసుల అదుపులో చేపల దొంగలు

చేబ్రోలు: చేబ్రోలు గ్రామ పంచాయతీకి చెందిన పెద్ద మంచినీటి చెరువులో అర్ధరాత్రి చేపలు పడుతున్న ఇద్దరు స్టువార్టుపురం దొంగలు పోలీసులు అదుపులో ఉన్నారు. చేబ్రోలు పరిధిలోని కొమ్మమూరు చానల్‌కు పక్కనే ఉన్న 22 ఎకరాల మంచినీటి చెరువులో కొంత కాలంగా రాత్రి సమయాల్లో పెద్ద పెద్ద చేపలను పట్టుకొని వెళ్తున్నారు. నీళ్ల మోటార్లు, కాపర్, యంత్ర పరికరాలు అపహరణకు గురవతుండటంతో పంచాయతీ కార్యదర్శి కారసాని శ్రీనివాసరావు ప్రత్యేక నిఘా ఏర్పాటు చేశారు. ఆటోలో వచ్చి నలుగురు దొంగలు మంచినీటి చెరువులోని పెద్ద పెద్ద చేపలను పడుతుండటంతో పంచాయతీ సిబ్బంది పథకం ప్రకారం వారిలో ఇద్దరిని పట్టుకుని పోలీసులకు అప్పగించారు. మరో ఇద్దరు పరారయ్యారు. వీరంతా స్టువార్టుపురానికి చెందిన వారిగా గుర్తించారు. దీనిపై పోలీసులు విచారణ చేస్తున్నారు. పంచాయతీ కార్యదర్శి కె.శ్రీనివాసరావు ఫిర్యాదు మేరకు చేబ్రోలు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కన్జర్వేషన్ రిజర్వ్‌గా ఉప్పలపాడు పక్షుల కేంద్రం

లక్ష్మీపురం(గుంటూరు వెస్ట్): పెదకాకాని మండలం ఉప్పలపాడు పక్షుల కేంద్రాన్ని వన్య ప్రాణి చట్టం -1972 నిబంధనల ప్రకారం.. కన్జర్వేషన్ రిజర్వ్‌గా నోటిఫికేషన్ ఇచ్చినట్టు కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి చెప్పారు. గురువారం కలెక్టరేట్‌లో జరిగిన జిల్లా స్థాయి వెట్ ల్యాండ్ మేనేజ్‌మెంట్ సమావేశంలో జేసీ భార్గవ తేజతో కలిసి ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా డిస్ట్రిక్ట్ ఫారెస్ట్ ఆఫీసర్ హిమ శైలజ మాట్లాడుతూ ఉప్పలపాడు పక్షుల కేంద్రం 20ఏళ్లుగా అటవీశాఖ ఆధ్వర్యంలో నడుస్తోందని వివరించారు. దీనిని కన్జర్వేషన్ రిజర్వ్‌గా ప్రకటించి ప్రత్యేక గుర్తింపు తీసుకొస్తున్నట్లు వెల్లడించారు. అరుదైన పక్షి జాతులను కాపాడుకోవాలని చెప్పారు. వెట్ ల్యాండ్ ఉపయోగాలను వివరించారు. జిల్లాలో ఇప్పటి వరకు అటవీశాఖ ద్వారా గుర్తించిన 300 వెట్ లాండ్స్‌ను పంచాయతీ రాజ్, ఇరిగేషన్ , ఆర్ డబ్ల్యూఎస్, పొల్యూషన్ కంట్రోల్ బోర్డు , రెవెన్యూ స్టేక్ హోల్డర్ శాఖల అధికారులు పరిశీలించి నివేదిక అందించాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. సమావేశంలో డీఆర్వో షేక్ ఖాజావలి , ఆర్డీఓ కె.శ్రీనివాసరావు , పశు సంవర్ధక శాఖ జేడీ ఒ.నరసింహారావు పాల్గొన్నారు.

భక్తులకు మెరుగైన సేవలు అందించాలి

- ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి
- సత్రశాలలో శివరాత్రి ఉత్సవాలపై సమీక్ష


మాట్లాడుతున్న జూలకంటి

సత్రశాల(రెంటచింతల): మహా శివరాత్రి పురస్కరించుకుని ప్రముఖ శైవ క్షేత్రమైన సత్రశాల శ్రీ గంగా భ్రమరాంబ సమేత మల్లికార్జునస్వామిని దర్శించుకునే భక్తులకు మెరుగైన సేవలు అందించాలని మాచర్ల ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి తెలిపారు. స్థానిక దేవస్థానం ప్రాంగణంలో గురువారం ప్రజాప్రతినిధులు, వివిధ శాఖాధికారులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ప్రతిక్షణం అధికారులంతా అప్రమత్తంగా ఉంటూ భక్తులు ప్రశాంతమైన వాతావరణంలో దైవదర్శనం చేసుకునేందుకు చర్యలు చేపట్టాలని చెప్పారు. వృద్ధులు, నడవలేని వారికి ఆటోలను ఏర్పాటుచేయాలని సూచించారు. సత్రశాల వరకు రహదారికి ఇరువైపులా గుంతలను వెంటనే పూడ్చే పనులు చేపట్టాలని జెట్టిపాలెం కార్యదర్శికి ఆదేశించారు. సత్రశాలలోని ఉన్న 20 అన్నదాన సత్రాల వారు ఒక్కొక్కరూ 10 మంది చొప్పున స్వచ్ఛందంగా వలంటీర్లను ఏర్పాటు చేసుకోవాలని తెలిపారు. వైద్యశిబిరాలు ఏర్పాటు చేయాలని, ట్రాఫిక్‌కు అంతరాయం లేకుండా వాహనాలను పార్కింగ్ చేయించుకోవాలని సూచించారు. మాచర్ల నుంచి 20, పాలువాయి జంక్షన్ నుంచి 10, గురజాల నుంచి గోలి గ్రామం మీదుగా మరో రెండు బస్సులను ఏర్పాటు చేసేందుకు సిద్ధంగా ఉన్నామని, అవసరమైతే అదనంగా నడుపుతామని మాచర్ల ఆర్టీసీ డిపో మేనేజర్ బి, వీరస్వామి తెలిపారు. మహాశివరాత్రి ఉత్సవాలను విజయవంతం చేయడానికి పరాశక్తి సిమెంట్ ఫ్యాక్టరీ యాజమాన్యం, ఏపీ జన్‌కో అధికారులు సహకరించాలని దేవదాయశాఖ ఇన్‌స్పెక్టర్ సత్తెనపల్లి యన్. లీలావతి కోరారు. ముందుగా ఎమ్మెల్యే దంపతులు దేవస్థానంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. సమావేశంలో తహసీల్దార్ ఎం.అర్జున్‌నాయక్, ఎంపీడీఓ కె.సరోజినీదేవి, ఈవో గాదె రామిరెడ్డి, ఏపీ ట్రాన్స్‌కో ఏఈ మస్తాన్‌వలి, ఎస్ఐ సీహెచ్ నాగర్జున, మెడికల్ ఆఫీసర్ హేమ, పీఆర్ ఏఈ వెంకటేశ్వరరెడ్డి, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ వెన్ను వెంకటేష్, ట్రస్ట్ బోర్డు సభ్యులు, వివిధ శాఖాధికారులు, మాజీ వైస్ ఎంపీపీ గొంటు సుమంత్‌రెడ్డి, టీడీపీ మండల అధ్యక్షుడు అబ్బిరెడ్డి, పీహెచ్‌సీ అభివృద్ధి కమిటీ మాజీ చైర్మన్ బి.రామకృష్ణ, మున్నా ప్రభురాజు, నీలం మల్లయ్య, మందలపు హనిమిరెడ్డి పాల్గొన్నారు.

ద్విచక్ర వాహనం అదుపుతప్పి వ్యక్తి మృతి


ఇన్నయ్య మృతదేహం

తురకపాలెం(ముప్పాళ్ల): ద్విచక్ర వాహనం అదుపుతప్పడంతో పంట కాల్వలో వ్యక్తి బోర్లా పడి మృతి చెందిన సంఘటన గురువారం మండలంలోని గోళ్లపాడు గ్రామ సమీపంలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. పంట కాల్వలో మృతదేహం ఉన్నట్లు గుర్తించిన రైతులు పోలీసులకు సమాచారం అందించారు. సంఘటన స్థలానికి చేరిన వారు మృతదేహాన్ని కాల్వలోంచి బయటకు తీశారు. మండలంలోని తురకపాలేనికి చెందిన మక్కెన ఇన్నయ్య(45)గా గుర్తించారు. తలపైన తీవ్ర గాయంతో పాటుగా ముక్కుల వెంబడి రక్తం కారుతూ ఉండటంతో మొదట అనుమానాస్పద మృతిగా భావించారు. తర్వాత పోలీసులు విచారణ జరపగా తురకపాలెం గ్రామానికి చెందిన ఇన్నయ్య కొంకావారిపాలెం చేపల చెరువుకు కాపలా ఉండే చల్లం చర్ల ఏసురాజు అనే యువకుడితో కలిసి ద్విచక్ర వాహనంపై గోళ్లపాడు వైపు బయలుదేరారు. మార్గంమధ్యలో వాహనం అదుపు తప్పి ఇద్దరూ కిందపడి స్పృహ కోల్పోయారు. వాహనం వెనకాల కూర్చున ఇన్నయ్య కిందపడి తలకు గాయమై కాల్వలో జారిపోయాడు. చీకట్లో కనిపించకపోవడంతో ఏసురాజు తిరిగి ఇంటికి వెళ్లిపోయాడు. తెల్లవారిన తర్వాత ఇన్నయ్య కాల్వలో మృతి చెందాడని తెలియడంతో ఏసురాజు జరిగిన సంఘటన తీరును పోలీసులకు వివరించాడు. మృతునికి భార్య, ఇద్దరు పిల్లలున్నారు. భార్య ఫిర్యాదు మేర కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ వి.సోమేశ్వరరావు తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం సత్తెనపల్లి ఏరియా వైద్యశాలకు తరలించారు.

విద్యార్థినులను రక్షించిన పోలీసులు

- ప్రముఖ విద్యా సంస్థ నుంచి ఐదుగురు అదృశ్యం
- సత్తెనపల్లి పోలీసులకు అభినందనలు తెలిపిన హోం మంత్రి అనిత

సత్తెనపల్లి: అదృశ్యమైన ఐదుగురు మైనర్ విద్యార్థినులను పల్నాడు జిల్లా సత్తెనపల్లి పోలీసులు గురువారం రక్షించారు. వివరాలు ఇలా ఉన్నాయి. ఎన్టీఆర్ జిల్లా గన్నవరంలోని ఓ ప్రముఖ విద్యాసంస్థలో చదువుతున్న ముస్తాబాద్‌కు చెందిన ఐదుగురు మైనర్ విద్యార్థినులు అదృశ్యం కావడంతో వారి బంధువులు గన్నవరం పోలీసులకు ఫిర్యాదు చేశారు. వెంటనే స్పందించిన గన్నవరం పోలీసులు సాంకేతికతను వినియోగించి, విద్యార్థినులు సత్తెనపల్లి మీదుగా హైదరాబాద్ వెళుతున్నట్లు గుర్తించారు. వెంటనే సత్తెనపల్లి పోలీసులకు సమాచారం అందించారు. పల్నాడు జిల్లా ఎస్పీ కంచి శ్రీనివాసరావు ఆదేశాల మేరకు సత్తెనపల్లి డీఎస్పీ మేదరమెట్ల హనుమంతరావు ఆధ్వర్యంలో సీఐ బొప్పన బ్రహ్మయ్య, ఏఎస్ఐ రమణ, సిబ్బంది దరియావలి, సలీం, దశరథ్‌నాయక్‌లు ఉదయం 6:30-7:00 గంటల మధ్య విజయవాడ-నల్గొండ వెళుతున్న కోణార్క్ ఎక్స్‌ప్రెస్ రైలులో తనిఖీలు నిర్వహించారు. ఐదుగురు విద్యార్థినులను అదుపులోకి తీసుకొని వారి తల్లిదండ్రులకు అప్పగించారు. గన్నవరం పోలీసుల సమాచారం మేరకు సత్వరమే స్పందించి విద్యార్థినులను రక్షించిన సత్తెనపల్లి పోలీసులను రాష్ట్ర హోం శాఖ మంత్రి వంగలపూడి అనిత ట్విట్టర్ ద్వారా, ఫోన్‌లో అభినందించారు.

బడ్జెట్‌లో 'వరికపూడిశెల'కు నిధులు కేటాయించాలి

- ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చేందుకు ప్రజా సంఘాల కార్యాచరణ
- రేపు వినుకొండ సీపీఎం కార్యాలయంలో రౌండ్‌టేబుల్ సమావేశం


ఆర్టీసీ బస్టాండ్‌కు ఎదురుగా పోస్టర్ ఆవిష్కరిస్తున్న ప్రజాసంఘాల నాయకులు

నరసరావుపేట: వరికపూడిశెల ప్రాజెక్టు(దమ్మర్లగొంది)కు బడ్జెట్లో నిధులు కేటాయించి పనులు మొదలు పెట్టాలని కోరుతూ ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చేందుకు ప్రజాసంఘాల నాయకులు కార్యాచరణకు పూనుకున్నారు. అందులో భాగంగా ఈనెల 22న వినుకొండలోని సీపీఎం కార్యాలయంలో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించనున్నారు. ఈ నేపథ్యంలో గురువారం స్థానిక ఆర్టీసీ బస్టాండ్ సెంటర్‌లో పోస్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా దేశభక్త ప్రజాతంత్ర ఉద్యమం(పీడీఎం) రాష్ట్ర నాయకులు వై.వెంకటేశ్వరరావు మాట్లాడుతూ పల్నాడు జిల్లాలో తాగు, సాగునీరు లేక ప్రజలు వలసలు పోతున్నారని తెలిపారు. పశువులకు నీళ్లు దొరకని ప్రాంతాలుగా ఎగువ పల్నాడులోని వెల్దుర్తి, దుర్గి, కారంపూడి, బొల్లాపల్లి మండలం, ప్రకాశం జిల్లా పుల్లలచెరువు ప్రాంతాలు ఉన్నాయని చెప్పారు. ప్రాజెక్టును సాధించుకోవాలని దశాబ్దాలుగా ఈ ప్రాంత ప్రజలు పోరాడుతున్నారని గుర్తు చేశారు. అధికారంలోకి వస్తే ప్రాజెక్టు పూర్తి చేస్తామని ఎన్నికల ముందు ఇప్పుడు అధికారంలో ఉన్న కూటమి నేతలు హామీ ఇచ్చారని తెలిపారు. ఈ నెల 24 నుంచి జరగబోయే ఏపీ అసెంబ్లీలో ప్రాజెక్టుకి నిధులు కేటాయించి, పనులు వెంటనే మొదలు పెట్టాలని డిమాండ్ చేశారు. రౌండ్ టేబుల్ సమావేశంలో రైతు సంఘాలు, వామపక్ష పార్టీలు, ప్రజా సంఘాలు, రాజకీయ పార్టీల ప్రతినిధులు, దళిత గిరిజన సంఘాలు పాల్గొని జయప్రదం చేయాలని ఆయన కోరారు. కార్యక్రమంలో పీడీఎం నాయకులు నల్లపాటి రామారావు, జిల్లా అధ్యక్షులు షేక్ మస్తాన్‌వలి, కార్యదర్శి జి.రామకృష్ణ, బీసీ నాయకులు బాదుగున్నల శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ఆరుగురు గంజాయి విక్రేతల అరెస్టు

నిందితుల్లో ఒకరు మైనర్


వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ జనార్దనరావు, పక్కన సీఐ మల్లికార్జునరావు

తెనాలిరూరల్: గంజాయి విక్రయిస్తున్న మైనర్ సహా ఆరుగురు నిందితులను పోలీసులు అరెస్ట్ చేశారు. తెనాలి వన్ టౌన్ పోలీస్ స్టేషన్‌లో గురువారం సాయంత్రం డీఎస్పీ బి.జనార్దనరావు వన్‌టౌన్ సీఐ మల్లికార్జునరావుతో కలిసి కేసు వివరాలు వెల్లడించారు. కొల్లిపర మండలం వల్లభాపురానికి చెందిన ఆరుమళ్ల సాహిత్ రెడ్డి, రెడ్డిబత్తుల హర్షవర్ధరెడ్డి, పాముల రిషిబాబు, తెనాలి రామలింగేశ్వరపేటకు చెందిన యర్రమోతు పవన్ ప్రశాంత్, నాజరుపేటకు చెందిన పసుపులేటి వెంకటేశ్వరరావు, గంగానమ్మపేటకు చెందిన మరో మైనర్ కలిసి వైకుంఠపురం రైల్వే అండర్ పాస్ వద్ద గంజాయి విక్రయిస్తుండగా అందిన సమాచారంతో గురువారం అరెస్ట్ చేసినట్లు చెప్పారు. ఇతర ప్రాంతాల నుంచి గంజాయి తీసుకువచ్చి తెనాలిలో అమ్ముతున్నట్టు గుర్తించామని వెల్లడించారు. వీరి వద్ద నాలుగు కిలోల 50 గ్రాముల గంజాయితో పాటు రూ. 4,500 నగదును స్వాధీనం చేసుకున్నట్లు వివరించారు. నిందితులను అరెస్ట్ చేసిన సీఐ మల్లికార్జునరావు, సిబ్బందిని డీఎస్పీ అభినందించారు.

జేఈఈ మెయిన్స్ విద్యార్థికి సత్కారం

తెనాలి: జాతీయస్థాయి ఐఐటీ-జేఈఈ మెయిన్స్ పరీక్షల్లో రికార్డు స్థాయిలో 99.37 పర్సెంటైల్ సాధించిన తెనాలి వివేక జూనియర్ కాలేజి విద్యార్థి తూనుగుంట్ల వెంకట పవన్‌కుమార్‌ను రాష్ట్ర పౌరసరఫరాలశాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ అభినందించారు. తెనాలిలోని తన కార్యాలయంలో శాలువాతో సత్కరించి, పుష్పగుచ్ఛాన్ని అందజేశారు. పేద కుటుంబానికి చెందిన పవన్‌కుమార్‌కు ప్రభుత్వపరంగా, వ్యక్తిగతంగా అండగా ఉంటానని హామీ ఇచ్చారు.